ట్రంప్.. ఇన్‌సైడర్ ట్రేడింగ్!

టారిఫ్‌ల వాయిదా వెనుక అనుమానాలు

స్వలాభం కోసమేనా అమెరికా అధ్యక్షుడి ప్రతీకార సుంకాలు

ఇంటా, బయట పెద్దగా వెల్లువెత్తుతున్న ఆరోపణలు

'యూ-టర్న్'కు ముందు అసలేం జరిగింది?

సంచలన నిర్ణయాలతో ఎప్పుడూ వార్తల్లో నిలిచే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరోసారి హెడ్‌లైన్స్‌కు ఎక్కాడు.

ప్రతీకార సుంకాలంటూ గతకొద్ది రోజులుగా హల్‌చల్ చేసిన అగ్రరాజ్యాధినేత.. ఒక్కసారే మనసు మార్చుకున్నారు. అడ్డగోలు టారిఫ్‌లతో అల్లకల్లోలం సృష్టించి.. ఇప్పటికైతే ఏం కాదులే అని ముగించేశారు.

అయితే దీని వెనుక ట్రంప్ స్వప్రయోజనాలే ఉన్నాయన్న విమర్శలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తుండటం గమనార్హం. అమెరికన్ బాస్ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలు ప్రస్తుతం ఆ దేశాన్నే కాదు.. యావత్తు ప్రపంచాన్నే నివ్వెరపోయేలా చేస్తున్నాయి.

వాషింగ్టన్, ఏప్రిల్ 10: అమెరికాను ప్రపంచ దేశాలు అక్రమంగా దోచుకుంటున్నాయి.. ఇక ఊరుకోబోం.. మా దగ్గర్నుంచి ఇన్నాళ్లూ వసూలు చేసినదాన్ని తిరిగి తీసుకుంటాం.. నా దేశ ప్రయోజనాలకే నేను పెద్దపీట వేస్తాను.. ఈ విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదు ఇవి.. దాదాపుగా గత నెల రోజుల నుంచి అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, సృష్టించిన హంగామా. అయితే ఈ నెల 2న తమ వాణిజ్య భాగస్వాములపై కొత్త టారిఫ్‌లను ప్రకటించి, 9వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయన్న ట్రంప్.. అనూహ్యంగా ఆఖరి నిమిషంలో యూ-టర్న్ తీసుకున్నారు. చైనా మినహా మిగతా దేశాలపై టారిఫ్‌లను 90 రోజులపాటు నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు. కానీ ఈ నిర్ణయానికి ముందు ట్రంప్ తన సోషల్ మీడియాలో రాసిన రాతలు.. ఇప్పుడు ఆయనపై ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణల్ని రేకెత్తిస్తున్నాయి.

ఇదీ సంగతి..

టారిఫ్‌ల వాయిదాకు కొద్దిగంటల ముందు ట్రంప్ తన సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు.. అమెరికాసహా అన్ని దేశాల స్టాక్ మార్కెట్లను పరుగులు పెట్టించాయి. బుధవారం అమెరికా స్టాక్ మార్కెట్లు మొదలైన కాసేపటికే సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'పై 'ఇది కొనడానికి సరైన సమయం' అని పోస్ట్ చేశారు. ఆ తర్వాత 'డీజేటీ' అని కూడా పెట్టారు. ఇది జరిగిన 4 గంటల తర్వాత అదనపు టారిఫ్‌లను 90 రోజులు వాయిదా వేస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు.

ఏంటీ డీజేటీ?

డీజేటీ అంటే ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్. టారిఫ్‌లను వాయిదా వేయాలని నిర్ణయించుకున్నాకే.. ఉద్దేశపూర్వకంగా డీజేటీ షేర్ల విలువను పెంచేందుకు ట్రంప్ ఈ రకమైన పరోక్ష సంకేతాలను ఇచ్చారని ఇప్పుడు వినిపిస్తున్న ప్రధాన ఆరోపణ. ఇందుకు తగ్గట్టే డీజేటీ షేర్ విలువ కూడా 22 శాతం వరకు పెరిగింది. ఈ క్రమంలోనే ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేయాలని డెమొక్రటిక్ పార్టీ సెనెటర్ ఆడమ్ చిఫ్ డిమాండ్ చేశారు. ఇదో ఇన్‌సైడర్ ట్రేడింగ్ కుంభకోణమని డెమొక్రాటిక్ సెనెటర్ క్రిస్ ముర్ఫీ కూడా ఆరోపించారు.

చైనాపై 145 శాతానికి సుంకాలు

చైనాపై అమెరికా ప్రతీకార సుంకాలు 145 శాతానికి చేరాయి. ఇప్పటికే 125 శాతంగా ఉన్న ఈ అదనపు టారిఫ్‌లు.. గురువారం మరో 20 శాతం పెరిగాయి. ఫెంటానిల్ అక్రమ రవాణాలో చైనా పాత్ర ఉందన్న ఆరోపణలకుగాను ప్రత్యేకంగా 20 శాతం సుంకాలు వేస్తున్నట్టు ట్రంప్ తాజా అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

మళ్లీ నష్టాల్లోకి అమెరికా సూచీలు

రికార్డు స్థాయిలో దూసుకుపోయిన అమెరికా స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. వాణిజ్య యుద్ధానికి కొన్ని రోజులు విరామం ఇచ్చినప్పటికీ ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉండటంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. డౌజోన్స్ ఏకంగా 1,500 పాయింట్లు లేదా 4 శాతం, నాస్‌డాక్ 5 శాతం నష్టపోయింది. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు అంచనావేసిన స్థాయి కంటే మెరుగైనవిగా ఉన్నప్పటికీ సూచీలు నష్టపోవడం విశేషం.

పసిడి పరుగో..పరుగు

రూ.3 వేల వరకు పెరిగిన తులం ధర

రూ.93,380కి చేరిన పది గ్రాముల విలువ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: బంగారం ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన పుత్తడి ధరలు గురువారం భారీగా పెరిగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాల విధింపుపై వెనక్కి తగ్గడంతోపాటు చైనాపై ప్రతీకార సుంకాలను 145 శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయం మదుపరుల్లో ఆందోళన పెంచిందని, ఫలితంగా తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు రికార్డు స్థాయిలో ఎగబాకాయి. గురువారం ఒకేరోజు దేశీయంగా పది గ్రాముల బంగారం ధర రూ.3 వేల వరకు ఎగబాకింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర రూ.2,940 ఎగబాకి రూ.93,530కి చేరుకున్నది. అటు ముంబైలోనూ రూ.2,940 అధికమై రూ.93,380 పలికింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.93,380కి చేరుకున్నది.

వెండిది అదే దారి

బంగారంతోపాటు వెండి ధరలు భారీగా పెరిగాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో ముంబైలో కిలో వెండి ఏకంగా రూ.2 వేలు పుంజుకొని రూ.95 వేలకు చేరుకున్నది. అలాగే హైదరాబాద్‌లో రూ.5 వేలు అధికమైన కిలో వెండి రూ.1.07 లక్షలుగా నమోదైంది. మరోవైపు, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర ఒక్క శాతం ఎగబాకి 3,116 డాలర్లకు చేరుకోగా, వెండి 30.96 డాలర్లుగా ఉన్నది.

బాండ్ మార్కెట్లే కారణమా?

వాషింగ్టన్, ఏప్రిల్ 10: టారిఫ్‌లపై ట్రంప్ వెనుకడుగు వేయడానికి బాండ్ మార్కెట్లే కారణమా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. అమెరికా ట్రెజరీ బాండ్లకు డిమాండ్ తగ్గి ఇన్వెస్టర్లు వాటిని కొనడానికి బదులుగా అమ్మకాలకు దిగుతుండటాన్ని గమనించామని ట్రంప్ చెప్పారు. వ్యాపారులు, పార్టీ నేతలు తాత్కాలికంగా టారిఫ్‌లను వాయిదా వేయాలని కోరినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే టారిఫ్‌ల వాయిదా. కాగా, టారిఫ్‌ల వాయిదాతో బుధవారం అమెరికా ప్రభుత్వ బాండ్ల రేట్లు 3.9 శాతం నుంచి 4.5 శాతానికి పెరిగాయి. బాండ్లకు డిమాండ్ తగ్గితే అమెరికాకు నిధుల సమీకరణ కష్టతరమవుతుంది. ప్రభుత్వ ఖర్చుల నిర్వహణకూ ఇబ్బందే. ఇది చివరకు మాంద్యానికి దారితీయవచ్చు.

అంతర్జాతీయ మద్దతు కోసం చైనా

ప్రతీకార సుంకాల నుంచి చైనాకు మినహాయింపునివ్వకపోవడంతో అమెరికాతో వాణిజ్య యుద్ధం మొదలైనట్టైంది. చైనాపై అమెరికా టారిఫ్‌లు 145 శాతానికి పెరిగితే.. అమెరికాపైనా చైనా దీటుగానే స్పందిస్తున్నది. అగ్రరాజ్యానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నది. అధిక సుంకాల ముప్పు ఉన్న యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలతో సంప్రదింపులు చేస్తున్నది. అలాగే ఆగ్నేయాసియా దేశాల ప్రభుత్వాలతోనూ చర్చలకు సిద్ధమవుతున్నది. అయితే చైనాతో సత్సంబంధాలు లేకపోవడంతో భారత్, ఆస్ట్రేలియాలు ఈ అంశంపై దూరంగా ఉంటున్నాయి. టారిఫ్‌ల ప్రభావం లేని రష్యా, మరికొన్ని దేశాలూ ఇంతే. దీంతో చైనా ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయో వేచిచూడాల్సిందే.

చిన్న వ్యాపారులకు కష్టాలు

అమెరికా-చైనా ట్రేడ్‌వార్ నేపథ్యంలో చిన్న వ్యాపారులకు పెద్ద దెబ్బే తగులుతున్నది. ముఖ్యంగా అమెరికాలో చిరు వ్యాపారులపై ఈ ప్రభావం భారీగానే ఉండనున్నది. మునుపు చైనా నుంచి దిగుమతి చేసుకున్న వస్తూత్పత్తులకు 26,000 డాలర్లు చెల్లిస్తే.. ఇప్పుడు వాటికే 3.5 లక్షల డాలర్లు చెల్లించాల్సి వస్తున్నది మరి. ఈ నేపథ్యంలోనే తన కంపెనీ మూతబడే పరిస్థితి వచ్చిందని, నిలువ నీడకూడా లేకుండాపోయేలా ఉందని ఓ అమెరికన్ వ్యాపారి కన్నీటి పర్యంతమయ్యారు.

బీవోబీ వడ్డీరేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: రిజర్వుబ్యాంక్ పరపతి సమీక్షలో కీలక వడ్డీరేట్లను పావు శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) కూడా వడ్డీరేట్లను పావు శాతం మేర తగ్గించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్‌తో అనుసంధానమైన రిటైల్, ఎంఎస్ఎంఈ విభాగానికి చెందిన రుణాలు మరింత చౌకగానున్నాయి. కానీ, ఎంసీఎల్ఆర్‌ని బ్యాంక్ యథాతథంగా ఉంచింది. అత్యధిక మంది తీసుకునే ఏడాది కాలపరిమితి కలిగిన వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీరేటు 9 శాతం కొనసాగిస్తున్నట్టు ప్రకటించింది.

భారత వృద్ధిరేటు డౌన్!

- **ఈ ఏడాది 6.1 శాతమే: మూడీస్**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధిరేటు అంచనాలకు మూడీస్ అనలిటిక్స్ కోత పెట్టింది. ఈసారి 6.1 శాతంగానే ఉండొచ్చని గురువారం అంచనా వేసింది. గతంలో ఇది 6.4 శాతంగా ఉండగా.. ఈ తగ్గింపులకు కారణం భారత్‌పై అమెరికా 26 శాతం ప్రతీకార సుంకాల ప్రతిపాదనలేనని 'ఏపీఏసీ ఔట్‌లుక్: యూఎస్ వర్సెస్ దెమ్' పేరిట విడుదలైన ఓ నివేదికలో మూడీస్ అనలిటిక్స్ పేర్కొన్నది. కాగా, వాణిజ్య యుద్ధం ప్రభావంతో రత్నాలు-ఆభరణాలు, మెడికల్ డివైజెస్, టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్ రంగాలు తీవ్రంగా దెబ్బతినవచ్చని హెచ్చరించింది. ఇదిలావుంటే ఈ ఏడాది ఆఖర్లోగా ఆర్బీఐ మరో పావుశాతం రెపోరేటును తగ్గించవచ్చని, 5.75 శాతానికి తీసుకురావచ్చని మూడీస్ అభిప్రాయపడింది.

జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్‌కు మరో అవార్డు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): జీఎమ్మార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) ప్రతిష్ఠాత్మక స్కైట్రాక్స్ సర్వేలో మరోసారి అత్యున్నత గౌరవాన్ని సాధించింది. ఇండియా అండ్ సౌత్ ఏషియా విభాగంలో 'బెస్ట్ ఎయిర్‌పోర్ట్ స్టాఫ్ 2025' అవార్డు నాలుగోసారి అందుకుంది. ఇది ప్రయాణికుల అనుభవాన్ని మెరుగుపరచడంలో, అతిథి సేవలు, కార్యకలాపాల్లో సమర్థతకు గుర్తింపుగా అందించారు. ఈ అవార్డును కంపెనీ సీఈవో ప్రదీప్ ఫణికర్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'ఇది మా సిబ్బంది, భాగస్వాముల అంకితభావం, ఆతిథ్యానికి ప్రతీకలాంటిదని, ప్రతి ఒక్కరూ ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. మేము వారి అవసరాలను ముందుగానే అంచనా వేసి, వ్యక్తిగత శ్రద్ధతో గుర్తుండిపోయే అనుభవాన్ని కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

లులు చేతికి మంజీరా మాల్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలోని మంజీరా మాల్‌ను నిర్వహిస్తున్న మంజీరా రిటైల్ హోల్డింగ్స్ నిర్వహణను స్వాధీనం చేసుకునేందుకు లులు ఇంటర్నేషనల్ షాపింగ్‌మాల్‌కు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్ సీఎల్ టీ) ఆమోదం తెలిపింది. మంజీరా మాల్‌ను హస్తగతం చేసుకోవడానికి మొత్తం 49 మంది పోటీ పడ్డారు. వీరిలో అత్యధికంగా రూ.318.42 కోట్లకు లులు సంస్థ బిడ్డింగ్ వేసి దక్కించుకున్నది. ఇందుకు రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పీ) అనుమతించింది. రుణాలు చెల్లించని మంజీరా కన్‌స్ట్రక్షన్స్‌పై దివాలా పరిష్కార ప్రక్రియ చేపట్టాలని కొంతకాలం క్రితం క్యాటలిస్ట్ ట్రస్టీషిప్ లిమిటెడ్ సంస్థ ఐబీసీ సెక్షన్-7 కింద ఎన్ సీఎల్‌టీలో ఫిర్యాదు చేసింది.

రోగి మెదడులో బుల్లెట్ తొలగింపు

కేర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 10: గచ్చిబౌలి కేర్ హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. గురువారం గచ్చిబౌలి హాస్పిటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. సోమాలియా దేశానికి చెందిన 26 ఏండ్ల గులెమ్ మహ్మద్ హెర్సీ అక్కడ జరిగిన కాల్పుల్లో గాయపడగా, ఇటీవల కేర్ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు నేతృత్వంలోని వైద్యబృందం 12గంటలపాటు శస్త్రచికిత్స చేసి మెదడులోని బుల్లెట్‌ను తొలగించారు. ఈ శస్త్రచికిత్స భారతదేశంలోనే అరుదైనదని, శస్త్రచికిత్స అనంతరం పేషెంట్ నెమ్మదిగా కోలుకుంటున్నాడని వైద్యులు తెలిపారు. ఈ సమావేశంలో కేర్ హాస్పిటల్ సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు, కేర్ హాస్పిటల్ సీవోవో నిలేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి నెట్‌వర్క్ కవరేజ్ మ్యాప్‌లు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): ఆయా టెలికాం నెట్‌వర్క్‌తోపాటు, 4జీ, 5జీ సేవల గురించి ఈజీగా తెలుసుకోవచ్చని ట్రాయ్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ట్రాయ్ నిబంధనలతో ఆయా టెలికాం సంస్థలు తమ వెబ్‌సైట్లలో మొబైల్ నెట్‌వర్క్ కవరేజ్ మ్యాప్‌లను అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నది. ఏ కంపెనీ, ఏ లొకేషన్‌లో 2జీ, 3జీ,4జీ, 5జీ సేవలు అందిస్తుందో ఈ మ్యాప్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపింది. సేవల నాణ్యత, ఫిర్యాదులపై వినియోగదారులు ఫీడ్‌బ్యాక్ ఇచ్చే ఆప్షన్‌ను కూడా అందుబాటులో ఉంచామని వివరించింది. దీనిద్వారా ఐటీ, ఇతర రంగాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నది. ఈనెల 1లోగా ఆయా నెట్‌వర్క్ సేవల వివరాలను లొకేషన్ మ్యాప్‌లతో సహా వెబ్‌సైట్‌లో ఉంచాలన్న ఆదేశాలతో వీటిని వెబ్‌సైట్‌లో ఉంచినట్టు వెల్లడించింది. ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో, వొడాఫోన్, ఐడియా ఇప్పటికే వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచగా, ప్రభుత్వరంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లు వివరాలు పెట్టాల్సి ఉందని ట్రాయ్ వివరించింది.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల పస్తులు!

- **వేతనాల కోసం 3 నెలలుగా ఎదురుచూపులు**
- **సుమారు 12,300 మందికి అందని జీతాలు**
- **అప్పులతో కుటుంబాలను పోషిస్తున్న సిబ్బంది**
- **ఏడాదైనా పేస్కేల్ హామీని నెరవేర్చని ప్రభుత్వం**

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి సకాలంలో వేతనాలు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో పస్తులతో కాలం వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క చెప్తున్న మాటలకు, క్షేత్రస్థాయిలోని పరిస్థితులకు ఎక్కడా పొంతనలేదని, ఇందుకు తమ దుస్థితే నిదర్శనమని చెప్తున్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలతో పనులు చేయించడం, సకాలంలో వేతనాలు అందించడంలో సాంకేతిక, క్షేత్రస్థాయి సిబ్బంది విధులు నిర్వహిస్తారు. క్రమం తప్పకుండా కూలీలతో పనులు చేయిస్తూ కేంద్రం నుంచి వీలైనంత మేరకు నిధులు రప్పించడంలో ప్రధాన పాత్ర పోషిస్తారు. కానీ వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని చెప్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లదే కీలక బాధ్యత

ఉపాధి కూలీలకు ఎంత ఎక్కువగా పనులు కల్పిస్తే అంత భారీ మొత్తంలో నిధులు విడుదలవుతాయి. కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించే బాధ్యతలో ఫీల్డ్ అసిస్టెంట్లు కీలక భాగస్వాములు. వారికి నెలకు రూ.10 వేల వేతనం. ఉపాధి పనుల్లో హరితహారం, డంపింగ్ యార్డులు, నీటినిల్వ పనులు, పండ్లతోటల పెంపకం, నర్సరీల నిర్వహణ, చెరువుల్లో పూడికతీత వంటి పనులను పర్యవేక్షిస్తుంటారు. ఇంత చేస్తున్నా సకాలంలో వేతనాలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమగోడును మంత్రులకు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

అమలుకు నోచుకోని పేస్కేల్ హామీ

ఉపాధి హామీ పథకంలో అదనపు ప్రాజెక్టు అధికారులు 2006 నుంచి కాంట్రాక్టు ఉద్యోగులుగానే పనిచేస్తున్నారు. తమను టార్గెట్లు విధిస్తూ పనిభారం పెంచుతున్న ప్రభుత్వం పేస్కేల్ అమలులో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఏపీవోలు మండిపడుతున్నారు. 2024 ఫిబ్రవరి 2న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఏపీవోలకు పే స్కేల్ అమలుచేస్తామని హామీ ఇచ్చారు. ఏడాది దాటినా మంత్రి సీతక్క ఇచ్చిన హామీ అమలుకాలేదని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

వేడుకున్నం.. ఆదుకోండి..

ఏటా కేంద్రం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయిస్తుంది. ఇందులో 60 శాతం కూలీలకు, 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ కింద నిధులు కేటాయిస్తారు. తాజాగా రూ.3,000-4000 కోట్లు సీసీ రోడ్లు, బిల్డింగ్ నిర్మాణాలకు కాంపోనెంట్ నిధులు కేటాయించారు. ఇందులో మాకు కేవలం రూ.100 కోట్లు కేటాయిస్తే ఏడాదిపాటు వేతనాలు అందుతాయి. ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు చెల్లించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్‌ను కలిసి వేడుకున్నాం. ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్టు చెప్పారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే బడ్జెట్ విడుదల చేయాలి.

-బొలుగురి రవి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

'దివ్యాంగుల విద్య'పై సర్కార్ శీతకన్ను!

- **అటకెక్కిన 'ప్రత్యేక విద్య' ఉపాధ్యాయుల శిక్షణ!**
- **షెడ్యూల్‌లో శిక్షణ తేదీలు ఇచ్చి మరీ వాయిదా**
- **ఆందోళనలో ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు**

ఖమ్మం, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర వ్యాప్తంగా 33జిల్లాల్లో ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల శిక్షణను రేవంత్ సర్కారు గాలికొదిలేసింది. నిరుడు ఎన్నడూ లేనివిధంగా దివ్యాంగుల విద్యాబోధనకు డీఎస్సీ-2024లో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ విభాగాల్లో సుమారు 900పైగా పోస్టులను ప్రకటించారు. వాటికి పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేసి నియామక పత్రాలు కూడా అందించారు. అప్పటినుంచి వారు తమకు కేటాయించిన పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే వారికి శిక్షణ జరుగుతున్న సమయంలోనే శిక్షణను నిలిపివేస్తున్నట్టు ఆయా జిల్లాల డీఈవోలకు విద్యాశాఖ నుంచి సంక్షిప్త సందేశాలు వచ్చాయి. తదనుగుణంగా డీఈవోలు శిక్షణను వాయిదా వేశారు. ఇది జరిగి నెలరోజులు కావస్తున్నా.. నేటికీ ప్రత్యేక ఉపాధ్యాయుల శిక్షణ షెడ్యూల్ ప్రకటించలేదు.

ఉపాధ్యాయ సంఘాల మండిపాటు..

డీఎస్సీ ఉపాధ్యాయులు, ప్రమోటెడ్ ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు శిక్షణ పూర్తిచేయకపోవడం, జాబ్‌చార్టు రూపొందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దివ్యాంగ విద్యపై శీతకన్ను వేసిందన్న సందేహాలు స్పష్టమవుతున్నాయి. ఆర్‌పీడబ్ల్యూడీ-2016 చట్టం ప్రకారం ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల శిక్షణ, జాబ్‌చార్టును తక్షణం అమలు చేయాల్సి ఉంటుందని పలు ఉపాధ్యాయ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. కానీ ప్రభుత్వం ఆ దిశగా చొరవ తీసుకోవడం లేదని మండిపడుతున్నాయి. ఇప్పటికైనా ప్రత్యేక ఉపాధ్యాయులకు జాబ్‌చార్జు రూపొందించి, శిక్షణను పూర్తిచేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

నారాయణపేట జిల్లా లంకాలలో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు

2 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

మక్తల్, ఏప్రిల్ 10 : 2 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్న ఘటన నారాయణపేట జిల్లాలో చోటుచేసుకున్నది. నర్వ మండలం లంకాలలో నాసిరకం విత్తనాలు అమ్ముతున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అగ్రికల్చర్ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. గ్రామానికి చెందిన కురువ బాలరాజు పొలంలోని షెడ్డులో ఐదు బ్యాగుల్లో ఉన్న 2 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్పీ యోగేశ్ గౌతమ్ తెలిపారు. ఎవరైనా రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలు అమ్మాలని చూస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొడంగల్ లిఫ్ట్‌లో కాట్రేవుపల్లి భూములు మినహాయించాలి

- **నారాయణపేట కలెక్టర్‌కు రైతుల వినతి**

మక్తల్, ఏప్రిల్ 10 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కోసం మక్తల్ మండలం కాట్రేవుపల్లిలో చేస్తున్న భూసేకరణను తమ భూములు మినహాయించాలని కోరుతూ గురువారం నారాయణపేట కలెక్టరేట్‌కు చేరుకొన్న రైతులు కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాట్రేపల్లి రైతు కేశవ్ మాట్లాడుతూ గతంలో వైఎస్ఆర్ హయాంలో భూత్పూర్ రిజర్వాయర్ నిర్మాణంలో కాట్రేపల్లికి చెందిన రైతుల భూములు 90 శాతం కోల్పోయినట్టు గుర్తుచేశారు. మిగిలిన 10 శాతం భూములు సైతం ప్రస్తుతం చేపట్టిన కొడంగల్ లిఫ్ట్‌లో కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. తమ జీవన విధానాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కలెక్టర్‌కు విన్నవించారు.

స్లాట్‌బుకింగ్‌పై రైటర్ల ఆందోళన

- **చంపాపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా**

చంపాపేట, ఏప్రిల్ 10: స్టాంపులు రిజిస్ట్రేషన్ల విభాగంలో మార్పుల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి డాక్యుమెంట్ రైటర్స్‌కు ఉపాధిని లేకుండా చేస్తున్నారని, ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డాక్యుమెంట్‌రైటర్స్ డిమాండ్ చేశారు. గురువారం చంపాపేటలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించకపోగా, వారు ఎంచుకున్న ఉపాధిని దెబ్బతీస్తున్నదని మండిపడ్డారు. అనంతరం డీఐజీ ట్వింకిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ సయ్యద్ నజీరుద్దీన్, డీ మహేశ్, జే మదన్‌మోహన్, కే నర్సింహ, ఎన్ వినయ్‌కుమార్‌గౌడ్, ఏ శేఖర్, ఏ రమేశ్, భాస్కర్‌రెడ్డి, కే లక్ష్మణ్, బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

15నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్లు : డీఐజీ

నేటి నుంచి ప్లాట్లు, భూములు రిజిస్ట్రేషన్లు సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో 15నిమిషాల్లోనే చేయించుకోవచ్చని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల విభాగం అధికారిణి ట్వింకిల్ తెలిపారు. గురువారం ఆమె డీఆర్‌వో సంతోష్‌రెడ్డితో కలిసి చంపాపేటలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూములు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ల కోసం తొలుత పైలట్ ప్రాజెక్ట్‌గా రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్, చంపాపేట, మహేశ్వరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రవేశపెట్టిందని వివరించారు. ఈ కార్యక్రమంలో చంపాపేట సబ్ రిజిస్ట్రార్ ఎంఏ రెహమాన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన సీఐ, గన్‌మన్

- **గ్రావెల్ లారీని విడిచిపెట్టేందుకు లంచం డిమాండ్**
- **ఏసీబీ అధికారులతో వాగ్వాదానికి దిగిన సీఐ**

భద్రాచలం, ఏప్రిల్ 10 : గ్రావెల్ తరలిస్తున్న లారీని విడిచిపెట్టేందుకు లంచం డిమాండ్ చేసిన సీఐ, గన్‌మన్, ఓ ప్రైవేటు వ్యక్తిని ఏసీబీ అధికారులు పట్టుకున్న ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో గురువారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 19న బూర్గంపాడు లక్ష్మీపురానికి చెందిన ఓ లారీలో గ్రావెల్ తరలిస్తుండగా భద్రాచలంలో పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు లేకుండా లారీని విడిచిపెట్టేందుకు యజమాని నుంచి సీఐ గన్‌మన్ రామారావు రూ.30 వేలు డిమాండ్ చేశారు. లారీ యజమాని రూ.20 వేలు సమకూర్చుకుని గన్‌మన్ రామారావుకు ఇవ్వడానికి రాగా ఆ డబ్బులు సారపాకకు చెందిన కార్తీక్‌కు పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఫోన్‌పే చేయించుకుని లారీని విడిచిపెట్టారు. లారీ యజమాని ఏసీబీ అధికారులకు విషయాన్ని వివరించగా గురువారం భద్రాచలం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఏసీబీ అధికారులు సారపాకలో కార్తీక్‌ను అదుపులోకి తీసుకుని, భద్రాచలం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని గన్‌మన్ రామారావు, సీఐ బరపాటి రమేశ్‌ను అదుపులోకి తీసుకొని ముగ్గురిని కలిపి విచారించారు. ముగ్గురిని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్టు ఏసీబీ డీఎస్పీ పేర్కొన్నారు. గన్‌మన్ చేసిన తప్పునకు తనను ఇరికించారని సీఐ రమేశ్ ఏసీబీ డీఎస్పీతో సీఐ వాగ్వాదానికి దిగారు.

భద్రాచలంలో ఏసీబీ అధికారులకు పట్టుబడిన సీఐ రమేశ్, గన్‌మన్ రామారావు, కార్తీక్

విద్యుత్ షాక్‌తో రైతు కూలీ మృతి



కర్నాల లింగయ్య

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 10 : బోరు మోటర్‌కు మరమ్మతులు చేస్తుండగా, ఓ రైతు కూలి మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం నాగాపూర్‌లో గురువారం చోటు చేసుకున్నది. చెన్నూర్ ఎస్ఐ వెంకటేశ్వర్ రావు కథనం ప్రకారం.. నాగాపూర్ గ్రామానికి చెందిన బడికెల లచ్చయ్యకు చెందిన వ్యవసాయ బోరు మోటర్ చెడిపోయింది. మరమ్మతుల అనంతరం రైతు కూలి కర్నాల లింగయ్య (48)తో పాటు మరో ముగ్గురు బావిలోకి మోటర్ దింపారు. ఆపై లింగయ్య భుజంపై మోటర్ పైపును పెట్టుకొని వెనక్కి వస్తున్న క్రమంలో విద్యుత్ తీగలు పైపునకు తగలడంతో షాక్ తగిలి, అక్కడికక్కడే మృతి చెందాడు. పాంతెపు రంజిత్, బడికెల లచ్చయ్య, అంగ రమేశ్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతుడికి భార్య పరిమళ, కూతురు, కుమారుడు ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.